సాక్షి తిరుపతి

ఆదివారం । 31 । మార్చి । 2024



నమ్మకద్రోహానికి నిదర్శనం బాబు

నమ్మక ద్రోహానికి నిదర్శనం చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. - IIలో



లారీని ఢీకొన్న ఆటో

ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన రేణిగుంట సమీపంలో చోటు చేసుకుంది. - IIలో



న్యూస్‌రీల్

సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహిద్దాం



మాట్లాడుతున్న జేసీ హెచ్‌ఎం ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిద్దామని జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు కేటాయించిన నోడల్ అధికారులు అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువులను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పెంచల్‌కిశోర్, అడిషనల్ ఎస్పీలు రాజేంద్ర, వెంకట్రావు, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికిరణ్, ఆదాయపుపన్ను అధికారి ఆసీస్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ సీబీఐసీ ఏజే ప్రసాద్ పాల్గొన్నారు.

3న బీఈడీ కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో 2023 సంవత్సరానికి సంబంధించి బీఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఏప్రిల్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లను చేపట్టనున్నట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. బీఈడీ కోర్సులో మొత్తం 51 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇందులో బయాలజికల్ సైన్స్-3, ఇంగ్లిష్-8, మ్యాథమెటిక్స్-15, ఫిజికల్ సైన్స్-4, సోషల్ సైన్స్-21 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా స్పెషల్ బీఈడీ కోర్సుకు సంబంధించి మొత్తం-17 సీట్లు అందుబాటులో ఉండగా అందులో మ్యాథమెటిక్స్-6, సోషల్‌సైన్స్-1, బయోలాజికల్ సైన్స్-10 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి సదుపాయాలకు అర్హులు కారని చెప్పారు. అడ్మిషన్లు పొందినవారు ప్రాసెసింగ్ ఫీజు రూ.1000, ఏడాదికి బీఈడీ కోర్సు ఫీజు రూ.23,284 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే స్పెషల్ బీఈడీలో అడ్మిషన్లు పొందిన వారు రూ.14,904 చెల్లించాలని తెలిపారు. 2023 ఎడ్‌సెట్ పరీక్షలో అర్హత పొంది, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, విద్యార్హత సర్టిఫికెట్లతో వర్సిటీలోని ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్‌లో జరిగే స్పాట్ అడ్మిషన్ ప్రక్రియకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు బీఈడీ కోర్సుకు సంబంధించి 9440675760, 8099399015 నంబర్లనందు, స్పెషల్ బీఈడీ అడ్మిషన్ల వివరాలకు 944164594, 9949458100 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ నైపుణ్యాలూ అవసరమే



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న శిక్షణ కార్యదర్శి రమణబాబు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో విద్యనభ్యసించే విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ కార్యదర్శి కేవీ. రమణబాబు తెలిపారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను పాలిటెక్నిక్ ఎలక్ట్రికల్ డిప్లొమో కోర్సు అభ్యసించినట్లు తెలిపారు. డిప్లొమో విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రతి డిప్లొమో విద్యార్థి చదువుతో పాటు ఉద్యోగ, ఇండస్ట్రీ నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొని ఉద్యోగావకాశాలు సాధించాలని సూచించారు. అనంతరం అకడమిక్ టాపర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు ఆ కళాశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రిన్సిపల్ వీ.శివరామన్ రూ.25 వేల విలువజేసే పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో డెప్యూటీ చీఫ్ టీ.శ్రీనివాసులు, ఓజీ ఇండియా ప్యాకేజింగ్ కంపెనీ మేనేజర్ కల్యాణ్‌రాము, ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు ఎస్‌వీ.గౌరీశంకర్, ఆర్.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సైకిల్‌కు నాంది

- తిరుపతిలో విచిత్ర పరిస్థితి
- కూటమితో చెదిరిన సైకిల్ గుర్తు
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బీజేపీ, జనసేన నేతలు
- ఆశావహులపై నీళ్లు చల్లిన టీడీపీ అధినేత
- వైఎస్సార్‌సీపీ ఛీకొట్టిన వారే ఇక్కడ కూటమికి పెద్దదిక్కు
- అవాక్కవుతున్న సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు
- కుమిలిపోతున్న కరుడుకట్టిన టీడీపీ నేతలు

‘పార్టీ పుట్టుక నుంచి టీడీపీనే అంటిపెట్టుకుని ఉన్నాం. కష్టకాలంలో అధినేతకు వెన్నంటే నిలిచాం. పార్టీ సిద్ధాంతాలు, ఆదేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం. కరుడుకట్టిన టీడీపీ వాదులమని గుర్తింపు తెచ్చుకున్నాం. ఎప్పుడైనా మా కల నెరవేరక పోతుందా..?.. టికెట్ రాకపోతుందా..? అని ఆశలు పెంచుకున్నాం. కూడబెట్టుకున్న పైసాపాతిక ఖర్చుచేశాం . ఇప్పుడు తీరా కూటమి అంటూ తీవ్రంగా అవమానించారు. ఆధ్యాత్మిక నగరంలో కనీసం పార్టీ గుర్తుకూడా లేకుండా చేశారు. అధికార పార్టీ ఛీకొట్టిన నేతల మోచేతికింద పనిచేయాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి వస్తుందని కలలో కూడా ఊహించుకోలేక పోయాం. ఇది రాష్ట్రంలో టీడీపీ కనుమరుగు కావడానికి సంకేతమనే చెప్పాలి. ఇప్పుడు ప్రజల్లోకెళ్లి మా కూటమి నేతలకు ఓటేయండని ఎలా అడిగేది చెప్పు బాబూ’ అంటూ టీడీపీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు రగిలిపోతున్నారు. తిరుపతిలో సైకిల్ గుర్తే లేకుండా చేశారంటూ మండిపడుతున్నారు.



తిరుపతి తుడా: తిరుపతిలో కూటమి నేతలకు 2024 సార్వత్రిక ఎన్నికలు విచిత్ర పరిస్థితులను తెచ్చిపెట్టాయి. ఎవరూ ఊహించని రీతిలో అభ్యర్థుల మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. పార్టీల జెండా, ఎజెండా కనుమరుగైంది. టికెట్ కోసం కష్టాలు ఎదుర్కొన్న నేతలను పక్కకు నెట్టాల్సి వచ్చింది. ఛీకొట్టి, పక్కనపెట్టిన అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఇక్కడ కూటమికి పెద్దదిక్కుగా మారాల్సి వచ్చింది. కూటమి కుంపట్లు రగులుతున్న వేళ టీడీపీ ఆశావహులు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోవాల్సి వచ్చింది.

ఛీకొట్టిన వారు.. స్థానికేతరులే కూటమికి పెద్దదిక్కు

పొత్తులో భాగంగా తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని జనసేనకు, పార్లమెంటు స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. జనసేన తిరుపతి సీటును వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు, బీజేపీ తిరుపతి పార్లమెంటు స్థానాన్ని గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు కట్టబెట్టారు. ప్రజాసేవలో విఫలమై పోటీకి పనికిరారని పక్కనపెట్టిన వారే ఇప్పుడు ఇక్కడ కూటమికి పెద్ద దిక్కుగా మారారు. ఎందుకూ పనికిరారని తేల్చి పక్కనపెట్టిన వ్యక్తులకు టికెట్ ఇవ్వడంపై స్థానిక బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు రగిలిపోతున్నారు. అభ్యర్థుల ఎంపికపట్ల కొందరు బహిరంగంగా, మరికొందరు లోలోపల కత్తులు నూరుతున్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న చంద్రబాబు దిగజారుడు నిర్ణయంతో బలైపోయామని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పార్టీలు ఇటీవల ఆత్మీయ సమావేశాలను నిర్వహించి.. జనసేన నాయకులతో ఆరణి శ్రీనివాసులు, వరప్రసాద్‌తో బీజేపీ నాయకుల పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సమావేశాలు రెండూ ఎడమొహం పెడమొహంగానే సాగాయి. ఆ నేతల పేర్లను ఉచ్చరించడానికి కూడా కొందరు ఇష్టపడలేదంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కట్టప్పా..ఇదేంతప్పా?

తెలుగుదేశం పార్టీకి తిరుపతిలో విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఎవరూ ఊహించని విధంగా తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు జనసేన, బీజేపీ ఎగరేసుకుపోయాయి. ఈ క్రమంలో టీడీపీ నేతల్లో అలజడి మొదలైంది. తిరుపతిలో సైకిల్ గుర్తు కనుమరుగు అయ్యిందని టీడీపీ వీరాభిమానులు కుమిలిపోతున్నారు. ప్రజల వద్ద సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందంటూ మరికొందరు చర్చించుకుంటున్నారు. బాబు 40 ఇయర్స్ ఇండస్ట్రీ అనుభవం ఇదేనా? అంటూ మదన పడుతున్నారు. సైకిల్ గుర్తుపై ఒక ఓటు కూడా వేసే స్థితిని లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవీఎంలో సైకిల్ గుర్తే కనిపించనప్పుడు మేమంతా ఓటింగ్‌కు ఎందుకు పోవాలంటూ ఎన్టీ రామారావు ఫాలోయర్స్, కరుడుగట్టిన టీడీపీ వాదులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ స్థాపించిన నాటి నుంచి తమకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిస్సహాయ స్థితిలో నేతలు

తిరుపతి ఎంపీ స్థానాన్ని బీజేపీకి, ఎమ్మెల్యే స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో స్థానికులు రగిలిపోతున్నారు. స్థానికుల్లో ఎవరికో ఒకరికి టికెట్ ఇస్తే కలిసి పనిచేసేవాళ్లమని, స్థానికేతరులకు టిక్కెట్ ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. టీడీపీ, జనసేన ముఖ్యనేతలంతా తీవ్రస్థాయిలో అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సైతం తీవ్ర స్థాయిలో జనసేన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. అలాగే మిగిలిన టీడీపీ నేతలు సైతం ఆరణి శ్రీనివాసులు ఎంపిక పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆ పార్టీ నేతలను మందలించడంతో ఇష్టం లేకున్నా ఒప్పుకోక తప్పలేదని కొందరు చెప్పుకొస్తున్నారు. దీంతో ఆయా పార్టీల నేతలు తీవ్ర నిస్సహాయ స్థితిలో మునిగిపోయినట్టు తెలుస్తోంది.

4న నాయుడుపేటలో ‘మేమంతా సిద్ధం’



సభా స్థలిని పరిశీలిస్తున్న ఎంపీ, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఏప్రిల్ 4వ తేదీన నాయుడుపేటకు చేరుకోనున్నట్టు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఇతర నాయకులతో కలిసి సిద్ధం బహిరంగ సభ స్థలాల పరిశీలనలో నిమగ్నమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధం బస్సు యాత్రలో భాగంగా నాయుడుపేటలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. నాయుడుపేట సమీపంలోని జువ్వలపాళెం గ్రామ సమీపంలో, విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న బహిరంగ ప్రదేశాలను పరిశీలించినట్టు వెల్లడించారు. వారి వెంట ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కట్టాసుధాకర్‌రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బాల శ్రీమంత్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ సునీల్‌రెడ్డి, కటకం జయరామయ్య, ఒట్టురు కిషోర్ యాదవ్, మహిళ రాష్ట్ర కార్యదర్శి ఈదా రత్నశ్రీ, పేర్నాటి రాహుల్ ఉన్నారు.



సిద్ధం సభ ఏర్పాట్ల పరిశీలనలో..

రాజకీయాలకే ఆదర్శం జగనన్న

- రాష్ట్ర ప్రజలు మళ్లీ సీఎంగా జగనన్ననే కోరుకుంటున్నారు
- చంద్రబాబుకు ఈ ఎన్నికలే చివరి ఎన్నికలు
- పొత్తులతోనే చంద్రబాబు పతనం ప్రారంభం
- తిరుపతిలో లక్ష ఓట్ల మెజారిటీ ఖాయం
- తిరుపతి 34, 44 డివిజన్లలో ఎమ్మెల్యే భూమన ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రాజకీయ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, రాష్ట్ర ప్రజల గుండెల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచ రాజకీయాలకే ఆదర్శమని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. తిరుపతిలోని 34, 44 డివిజన్లలో శనివారం కార్పొరేటర్లు శ్రావణి మునిరామిరెడ్డి, వరికుంట్ల నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత 40 ఏళ్లలో ఎవ్వరికీ సాధ్యంకాని విధంగా కేవలం రెండేళ్లలో ఇంతగా తిరుపతిని అభివృద్ధి చేసిన అభినయ్‌ని కాకుండా మరొక నాయకుడిని ఎందుకు ఎన్నుకుంటామంటూ స్థానికులు భరోసా ఇచ్చారు.

దోచుకోవడమే బాబు నైజం

14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబుకు ఈ ఎన్నికలే చివరి ఎన్నికలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అధికార దాహంతో పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఏనాడైనా సంక్షేమాన్ని అందించావా? చంద్రబాబు అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలనంతా పెత్తందారులకు కొమ్ముకాయడం తప్ప పేదలకు చేసిందేమి లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వందల హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. పొత్తులతోనే చంద్రబాబు పతనం మొదలైయిందని స్పష్టం చేశారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనరంజక పాలన అందించిన జగనన్న వైపే ప్రజలంతా ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నను సీఎంగా ఎన్నుకోవడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

అభినయ్‌కి లక్ష మెజారిటీ ఖాయం

40 ఏళ్లలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా తిరుపతిని రెండేళ్లలోనే అభివృద్ధి చేసి చూపిన యువనాయకుడు భూమన అభినయ్‌రెడ్డి అని ఎమ్మెల్యే భూమన తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా తిరుపతి నగరంలో 22 మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించారని గుర్తుచేశారు. అభినయ్ పట్ల తిరుపతి ప్రజలు చూపుతున్న ఆదరాభిమానంతో రానున్న ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు. పార్టీ సీనియర్ నా యకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, కంకనాల రమేష్, బొమ్మగుంట రవి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షు లు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు తిరుపతి మునిరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శైలజ, ఆరణి సంధ్య, దూదికుమారి, కో–ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, పార్టీ నాయ కులు పోలిరెడ్డి నాగిరెడ్డి, మార్కెట్ మునిరామిరెడ్డి, అశోక్‌కుమార్, నాదముని, యోగాంజనేయులు, రాఘవులునాయుడు, జక్కన్న, ధనంజయులు, దినేష్‌రాయల్, చందురాయల్, శ్రీధర్, పెరుగుబాబూయాదవ్, ప్రమీల, లక్ష్మి, గీతాయాదవ్, శారద, భాగ్యమ్మ, కవితమ్మ పాల్గొన్నారు.

అలరించిన ఫ్లాష్ మాబ్



ఫ్లాష్ మాబ్‌లో ఆకట్టుకున్న విద్యార్థులను నృత్యం



ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యం

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జరిగిన ‘విరించి 2కే24’ ఫ్లాష్ మాబ్ అలరించింది. విద్యార్థినులు కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. అనంతరం వీసీ డీ.భారతి మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి ఫ్లాష్ మాబ్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజినీ, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పీ.మల్లికార్జున, ప్రొఫెసర్ వీ.సరిత పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ

మహిళల ఆత్మరక్షణ కోసం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మహిళా వర్సిటీలో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మాట్లాడుతూ మహిళలు భయాన్ని, కోపాన్ని అధిగమించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సారా సరోజని, ఎం.విద్యావతి, గాయిత్రి, శాంతి, భార్గవి, కోచ్ రమణన్ పాల్గొన్నారు.

అవమానం.. అగౌరవం!

- తెలుగు తమ్ముళ్లకు అడుగడుగునా అవమానాలే
- మాజీ ఎమ్మెల్యేలను పలకరించని బాబు
- రిషితారెడ్డి అనుమతి ఉంటేనే వేదికపైకి
- శ్రీకాళహస్తి సీనియర్ నేతలను అడ్డుకున్న వైనం
- బాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన ఎమ్మెల్యే ఆదిమూలం

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి: చంద్రబాబు చేపట్టిన ప్రజాగళంలో తెలుగు తమ్ముళ్లకు అడుగడుగునా అవమానాలు తప్పలేదు. శ్రీకాళహస్తి సభలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్యను చంద్రబాబు మాట వరసకైనా పలకరించలేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోవడం కనిపించింది. చంద్రబాబు వస్తున్నారని తెలిసి నియోజకవర్గం నుంచి తరలివచ్చిన సీనియర్ నాయకులందరి పేర్లు సెక్యూరిటీకి ఇవ్వకపోవడంతో ఎవ్వరినీ వాహనంపైకి ఎక్కించలేదు. దీంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేతలు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, కామేష్‌యాదవ్, గాలి మురళీనాయుడు, పొన్నారావు, బాలాజీ నాయుడు, జగన్నాథం నాయుడుతో పాటు పార్టీలో చేరేందుకు వచ్చిన నాయకులను తీవ్రంగా అవమానించి పంపేశారు. అదేవిధంగా సత్రవాడ ప్రవీణ్, ఎస్సీవీ దిలీప్ మరికొందరిని రిషితారెడ్డి అనుమతిస్తేగానీ వేదికపైకి ఎక్కనివ్వలేదు. చెంచమనాయుడు ఈ అవమానాన్ని భరించలేక పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. ఇదిలా ఉంటే.. ఏర్పేడు ఇసుక మాఫియాకు 16 మంది బలైన ఘటనలో ప్రధాన ముద్దాయిగా ఉన్న ధనంజయనాయుడుని మాత్రం బొజ్జల బృందమ్మ ప్రత్యేకంగా వేదికపైకి ఆహ్వానించారు. పార్టీకి మొదటి నుంచి కష్టపడుతున్న వారిని పక్కనపెట్టి.. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు, కూటమికి చెందిన ఇద్దరు ముగ్గురు నాయకులకు బొజ్జల కుటుంబీకులు ప్రాధన్యత ఇవ్వడంతో టీడీపీ ముఖ్యనాయకులు చాలామంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



నాయుడుపేటలో వికసించని కమలం

చంద్రబాబు పర్యటనలో నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రసంగించిన సమయంలో టీడీపీ, జనసేన జెండాలు తప్ప కూటమిలో ఉన్న మూడో పార్టీ బీజేపీ జెండా ఒక్కటీ కనబడలేదు. బీజేపీ నేతలకు పిలుపులేకుండా పోవడమే ఇందుకు కారణమని పలువురు గుసగుసలాడారు. తాను అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం ఇస్తానని చెప్పడం తప్పితే.. మరో మాటకు చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వకపోవడం గమనార్హం.

సభకు రావడానికి ఇష్టపడని జనం

నాయుడుపేట, శ్రీకాళహస్తిలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు జనాన్ని తరలించేందుకు టీడీపీ నేతలు నానా తంటాలు పడ్డారు. రెండు రోజులుగా ఊరూరా తిరిగి సభకు రావాల్సిందిగా ప్రాధేయపడ్డారు. సభకు రావడానికి జనం ఇష్టపడకపోవడంతో ఒక్కొక్కరికీ రూ.200, క్వార్టర్ మద్యం , మహిళలకు రూ.200, బిరియానీ ప్యాకెట్లు ఇచ్చి తరలించారు. శ్రీకాళహస్తి సభకు నియోజకవర్గ ప్రజలు రాకపోవడంతో నాయుడుపేట, సత్యవేడు, వెంకటగిరి ప్రాంతానికి చెందిన వారిని తీసుకురావాల్సిన పరిస్థితి. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి నిర్వహిస్తున్న సభలు కావడంతో జనం అనూహ్యంగా వస్తారని భావించారు. జనం నుంచి స్పందన లేకపోవడంతో కూటమి నేతలు షాక్ గురయ్యారు.

ఇదేందయ్యా.. చంద్రం !

నాయుడుపేట, శ్రీకాళహస్తి సభల్లో చంద్రబాబు ప్రసంగాన్ని విన్న జనం ఈయనకు చిప్పు చెడినట్టుంది అంటూ నవ్వుకోవడం కనిపించింది. ఇటీవల కుప్పంలో మాట్లాడినట్టే యువత ఇంటివద్ద నుంచే ఉద్యోగం చేసుకునేలా ప్రపంచాన్ని అనుసంధానం చేస్తానన్నారు. నాయుడుపేట సభలో సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి పేరు తెలియక ఆమెనే అడిగి తర్వాత ఆమె పేరు ప్రస్తావించారు. శ్రీకాళహస్తి సభలో ‘‘వరప్రసాద్‌ను కాదని బీజేపీకి ఓటేస్తే.. వాళ్ల వల్ల ఒరిగేది ఏముంది’’ అని అన్నారు. ఈయనకు కూటమి అభ్యర్థులు ఎవరో తెలియదు.. అంటూ ఆ పార్టీ కార్యకర్తలు సైతం నెత్తి కొట్టుకోవడం కొసమెరుపు.

క్లుప్తంగా

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసుల కథనం.. ఎస్సార్‌పురం మండలం, పాపిరెడ్డి పల్లికి చెందిన ఈదుల రవి(55) పుత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతని భార్య గీత తన కుమారుడితో కలిసి బెంగళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుడు వద్ద లభించిన ఆధారాల మేరకు అతని భార్యకు, అదేవిధంగా అలిపిరి పోలీస్ స్టేషన్‌లో మృతుడు అక్క హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మునిలక్ష్మికి సమాచారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి



చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిని గుర్తుతెలియని యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు చంద్రగిరి సీఐ రామయ్య తెలిపారు. పోలీసుల కథనం.. సుమారు 25 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు ఈనెల 26వ తేదీన పనపాకం రైల్లే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి ద్విచక్ర వాహనానికి ఎటువంటి నంబరు ప్లేటు లేకపోవడంతో ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి వివరాల తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ సేవా సదన్ వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,958 మంది స్వామివారిని దర్శించుకోగా 31,245 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నమ్మక ద్రోహానికి నిదర్శనం బాబు

- నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి ధ్వజం
- వైఎస్సార్ సీపీలోకి 250 మంది యువత



యువతతో జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవయ్య, ఎన్‌డీసీసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

నాయుడుపేట టౌన్ : నమ్మక ద్రోహం, దగాకోరు విధానాలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు నాయుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నాయుడుపేట పట్టణంలోని కామిరెడ్డి రాజారెడ్డి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కలను నిజం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని తిరుపతి జిల్లాగా మార్చారని గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను 95 శాతానికిపైగా నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదు

అనంతరం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ దోచుకోవడం, దాచుకోవడం చంద్రబాబు నైజమని, ఆయన పేద ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. సంపద పేరుతో చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల అండదండలు మెండుగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, ఇతర మిత్ర పక్షాలు బంగాళాఖాతంలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలమైన శక్తిగా మారిందన్నారు. అంతకుముందు పార్టీ జిల్లా అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యే తదితర నాయకులను కామిరెడ్డి రాజారెడ్డి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే పార్టీ మండల కన్వీనర్లు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సునీల్‌రెడ్డి, ఆర్ముగం, మొదిలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెంచయ్య, ఎంపీపీ ధనలక్ష్మి తదితరులు ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, పోట్లా పూడిరాజేష్, కోండూరు మనోహర్‌రాజు, పట్టణ యువ అధ్యక్షులు పాలేటి నాగార్జున, జీసీ నాయకులు వెంకటేశ్వర్లు , పార్టీ రాష్ట్ర మహిళ కార్యదర్శి ఆదా రత్న శ్రీ, పట్టణ మహిళ అధ్యక్షురాలు కన్మణి తదితరులు పాల్గొన్నారు.

250 మంది చేరిక

పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన 250 మందికి పైగా టీడీపీ యువత స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి సారథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో పాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ డల్.. వైఎస్సార్‌సీపీ ఫుల్!

- చిన్నగొట్టిగల్లు మండలంలో జోరుమీదున్న వైఎస్సార్‌సీపీ
- కొత్తపల్లిలో టీడీపీ నుంచి 17 కుటుంబాల చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : చంద్రగిరి నియోజకవర్గం, చిన్నగొట్టిగల్లు మండలంలో వైఎస్సార్‌సీపీ జోరు కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. శనివారం మండలంలోని తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన 17 కుటుంబాలు గుంపగుత్తగా వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నాయి. ఇందుకు తుమ్మలగుంటలోని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాసం వేదికైంది. వారిని ఆత్మీయంగా పలకరించి, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 'మమ్మల్ని నమ్మి..మా కోసం విచ్చేసిన మీ అందరికీ అన్ని విధాలా అండగా ఉంటా'నని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భరోసా కల్పించారు. 'ఏళ్లుగా టీడీపీలో కొనసాగారు. కులం, మతం, పార్టీ తేడాలేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందించడంలో సీఎం జగన్ పాలన, నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలని సంకల్పించే చెవిరెడ్డి కుటుంబం వెంట నడుస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో బీసీ నాయకులు ఆనంద్, సుధాకర్, చెంగల్‌రాయులు, సుబ్రమణ్యం, కృష్ణయ్య, సూరిబాబు, సిద్ధయ్య, నాగభూషణం, దామోదర్, శివయ్య, సుబ్రమణ్యం, వెంకటరమణ, చంద్రయ్య, గురుమూర్తి, వెంకటరమణ, చెంగల్‌రాయుడు, సమ్మోహనరెడ్డి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

- ఇద్దరి మృతి




హరిబాబు (ఫైల్), మధుబాబు (ఫైల్)

పాకాల: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి నేంద్రగుంట సమీపంలో పూతలపుట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. శుక్రవారం రాత్రి చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళుతున్న లారీ మరమ్మతుల కారణంగా నేంద్రగుంట సమీపంలోని ఫ్లైఓవర్‌పై ఒక పక్కన నిలిపేశారు. అదే మార్గంలో వెళుతున్న ఆటో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పూతలపట్టు మండలం, బయటపల్లి గ్రామానికి చెందిన హరిబాబు(51) అక్కడికక్కడే మృతి చెందగా.. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మధుబాబు(41) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యలో మృతి చెందాడు. నిబంధనలకు విరుద్ధంగా హైవేపై లారీని ఆపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. సీఐ రాజగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



తిరుపతి ఎడ్యుకేషన్ : కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు వంశిత శ్రీ, మనోజ్ఞ భాయ్, సోనిక, ధర్షిణిశ్రీ, నిత్యశ్రీ, వర్షిణి బాలికల సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధిస్తుండడం తమ విద్యాసంస్థలకే గర్వకారణమన్నారు.. అనంతరం ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

ఎట్టెట్టా...!

ఓటరు కార్డుకు 31 ఏళ్లు



భారత ఎన్నికల కమిషన్ 1950 జనవరి 25 ఏర్పాటైంది. అప్పటి నుంచి 1993 వరకు ఓటరు గుర్తింపు కార్డులు లేవు. ఎన్నికల ప్రక్రియలో దొంగ ఓట్లను నివారించి, పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఓటరు గుర్తింపు కార్డును ప్రవేశపెట్టారు. అప్పట్లో ఆ నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఓటరు గుర్తింపు కార్డు అమలులోకి వచ్చి నేటికి 31 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను ప్రస్తుతం డిజిటల్ విధానంలో ముద్రించి ఓటరుకు అందిస్తున్నారు. ఓటరు జాబితాలోని క్రమసంఖ్య ప్రకారం ఓటరు ఫొటోతో, చిరునామా, వయస్సు సహా పూర్తి వివరాలను అందులో పొందుపరుస్తున్నారు.

-తిరుపతి సిటీ

చెరువులో పడి మహిళ మృతి



మృతి చెందిన నాగరాణి

వరదయ్యపాళెం: స్నానం కోసం చెరువులో దిగి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తికి చెందిన పవన్, నాగరాణి దంపతులిద్దరూ సంచారజీవులు. వారు వరదయ్యపాళెంలోని శివాలయం వద్ద చెట్ల కింద ఉండేవారు. అయితే శుక్ర వారం సాయంత్రం నాగరాణి(40) శివాలయం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి గట్టుపై నుంచి స్నానం చేసేందుకు ప్రయత్నించగా కాలుజారి చెరువులో పడిపోయారు. ఆలస్యంగా గుర్తించిన భర్త పవన్ అటువైపునకు వెళ్లి భార్య గురించి ఆరా తీశాడు. చెరువు సమీపంలో ఆమె ఆచూకీ లభించకపోవడం, చీకటి కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం చెరువు వద్దకు పోలీ సులు వెళ్లి పరిశీలించగా నీటిలో విగతజీవిగా ఉన్న నాగరాణి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. ఎస్ఐ ప్రతాప్ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడం, దహన సంస్కారాలకు ఆర్థిక పరిస్థి తి అడ్డురావడంతో ఎస్ఐ, సిబ్బంది చొరవతో దహన సంస్కారాలను నిర్వహించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.